క్లుప్తంగా

26న తెనాలిలో పోస్టల్ డాక్ అదాలత్

తెనాలిఅర్బన్: రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఆదేశాల మేరకు ఈనెల 26న తెనాలిలో డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కొత్తపేటలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. పోస్టల్ సేవలకు సంబంధించిన ఫిర్యాదులను దీనిలో తెలియజేయవచ్చన్నారు. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు డాక్ అదాలత్ అని రాసి ఈనెల 25వ తేదీలోపు పంపాలన్నారు. దీనిని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని సూచించారు.

రోడ్ల గుంతలు పూడ్చండి



తెనాలిఅర్బన్: 34వ వార్డులోని పలు రోడ్లపై గుంతలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆవార్డు ప్రజలు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. 32వ వార్డులోని పార్కు స్థలంలో జంగిల్ క్లియరెన్స్ చేయాలని, 28వ వార్డులో మంచినీటి కుళాయి కనెక్షన్ తొలగించాలని, 8వ వార్డు మహేష్ రెసిడెన్సిలో వాటర్ లీక్‌ను అరికట్టాలని పలువురు వినతి పత్రాలు ఇచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేనేజర్ విల్సన్ జయకర్, డీఈ ఆకుల శ్రీనివాసరావు, ఏసీపీ శివన్నారాయణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో సచివాలయ ఉద్యోగుల నిరసన



తెనాలిఅర్బన్: జీవో నెంబర్ 5ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అన్ని సచివాలయాల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బదిలీల కోసం ఇచ్చిన జీవో నెంబర్ 5 ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఉందన్నారు. దానిని ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

కొల్లిపరలో యువతి అదృశ్యమైందంటూ ఫిర్యాదు

కొల్లిపర: గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చి కనిపించకుండా పోయిన యువతి గురించి సోమవారం కొల్లిపర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. కె.ఎల్.యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న 20 సంవత్సరాలు యువతి బంధువుల ఇంటికి వచ్చింది. అయితే మూడు రోజులు తరువాత ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోవటంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలి



తెనాలిరూరల్: జులై 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని న్యాయమూర్తులు న్యాయవాదులను కోరారు. బ్యాంకులు, చిట్‌ఫండ్ కంపెనీలు, ఇతర ఫైనాన్స్ కంపెనీల న్యాయవాదులతో న్యాయమూర్తులు సోమవారం సమావేశం నిర్వహించారు. రాజీ అయ్యే అవకాశం ఉన్న కేసులన్నీ రాజీ అయ్యేలా చొరవ చూపాలన్నారు. తెనాలి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు, న్యాయమూర్తులు ఎం. ఇందిరా ప్రియదర్శిని, ఎం. శ్రీధర్, పవన్ కుమార్, వివేక్ వర్ధన్, రాజశేఖర్, బార్ అసోసియేషన్ సెక్రటరీ హరిదాసు గౌరీ శంకర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ప్రతిభ

దుగ్గిరాల: ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో స్థానిక విద్యార్థులు ప్రతిభ చాటారు. దుగ్గిరాల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు కొండూరు మణికీర్తన, చలువాది ప్రగతిలు తమ ప్రతిభ కనబరిచారు. కీర్తనకు ఒంగోలు కళాశాలలో సీటు రాగా.. ప్రగతి ఆర్కే వాలీ కళాశాలలో సీటు సంపాదించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కుటుంబ సభ్యులు, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎస్.శోభాదేవి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

నిలచిన కొబ్బరి పీచు తయారీ యూనిట్

కొబ్బరి బొండాల నిర్వహణ జఠిలం
- నెల రోజులుగా నిలచిన సేవలు
- రోడ్లపై పోస్తున్న కొబ్బరి బోండాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నూతనంగా ఏర్పాటు చేసిన పీచు తయారు చేసే యంత్రం

తెనాలిఅర్బన్: పట్టణంలో కొబ్బరి బొండాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మూడేళ్ల క్రితం తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డులో కొబ్బరి కాయల పీచు తయారీ యూనిట్‌ను ప్రారంభించిన ఆశించిన ఫలితాలు అందలేదు. దీంతో అధికారులు పట్టణంలో కొబ్బరి బొండాల సేకరణను అధికారులు పూర్తిగా నిలిపివేయటంతో వ్యాపారులు రోడ్లవెంట వాటిని పోస్తున్నారు.

పట్టణంలో సుమారు 40కి పైగా కొబ్బరి బొండాల విక్రయ దుకాణాలు ఉన్నాయి. వాటి ద్వారా ప్రతిరోజు 10 నుంచి 15 టన్నుల ఉపయోగించిన బోండాలు వస్తుంటాయి. ఇలా వచ్చిన వాటిని వ్యాపారులు ప్రతిరోజు పారిశుద్ధ్య కార్మికులకు అందజేస్తుంటారు. వారు బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డుకు తరలించి ఎండిన ఆ తర్వాత వాటిని కాల్చి వేస్తుండేవారు. మరి కొందరు కార్మికులు వాటిని రోడ్డు అంచులలో పోసేవారు. కొబ్బరి బొండాలను కాల్చకుండా వాటిని పీచుగా మార్చుకోవచ్చని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ 2022లో సూచించింది. దీంతో మున్సిపల్ అధికారులు కొబ్బరి కాయల పీచు తయారు చేసే యూనిట్‌ను నెలకొల్పాలని భావించి దానికోసం రూ.9.60 లక్షలు వెచ్చించారు.

మూడేళ్ల క్రితం అయిదు టన్నుల యూనిట్ ప్రారంభం

బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డులో అయిదు టన్నుల కొబ్బరి పీచును తయారు చేసే యూనిట్‌ను ఏర్పాటు చేశారు. తెనాలి పట్టణంలోని ఉపయోగించిన కొబ్బరి బొండాలను ప్రత్యేక వాహనంలో యూనిట్‌కు తెచ్చేవారు. యంత్రంలో వాటిని వేసి పీచును తయారు చేస్తున్నారు. పీచును కొద్దిరోజులు ఆరాబెట్టి ఆ తర్వాత వాటిని కట్టలు కట్టి విక్రయిస్తున్నారు. అయిదు టన్నుల బొండాలకు సుమారు అరటన్ను పీచు వస్తుంది. అలాగే పీచుతో పాటు కొంత కోకోపీట్ కూడా వస్తుంది. కోకో పీట్‌ను మొక్కలకు ఎరువుగా ఉపయోగిస్తున్నారు. పీచును టన్ను రూ.15 వేలకు విక్రయిస్తున్నారు.

నెల నుంచి నిలచిన యూనిట్ సేవలు

కంపోస్ట్ యార్డులో టెండర్లు దక్కించుకున్న సంస్థ నూతన మిషనరీని ఏర్పాటు చేసే పనిని ప్రారంభించింది. దీనిలో భాగంగా పాత మిషనరీని తీసివేసి నూతన యంత్రాన్ని ఏర్పాటు చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. అయితే అది కొద్దిసేపు పని చేసి ఆగిపోయింది. దీంతో సదరు సంస్థ నిర్వాహకులు వైరింగ్ మార్చాలని భావించి ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో నెల రోజుల నుంచి పాత యూనిట్ సేవలు పూర్తిగా నిలచిపోయాయి.

నూతన మిషనరీ ఏర్పాటుకు చర్యలు

కంపోస్ట్ యార్డులో ఏర్పాటు చేసిన కొబ్బరిపీచు తయారు చేసే యంత్రం కెపాసిటీ తక్కువగా ఉండటం.. బొండాలు ఎక్కువగా అక్కడికి వస్తుండటంతో సమస్య రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి అధికారులు తీసుకువెళ్లారు. ఆయన సూచన మేరకు ప్రవేట్ వ్యక్తులకు దీని నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు అవసరమైన టెండర్లు ఆరు నెలల క్రితం పిలిచారు. గుంటూరుకు చెందిన ఓ ఏజెన్సీ దీని నిర్వహణ బాధ్యతలు స్వీకరించేందుకు ముందుకు వచ్చింది. సదరు సంస్థ ప్రతిరోజు తెనాలి పట్టణంలో ఉత్పత్తి అయ్యే 15 టన్నుల కొబ్బరి బొండాలను పీచుగా తయారు చేసి మున్సిపాలిటీకి ఇవ్వాల్సి ఉంటుంది. అందుకుగాను సదరు సంస్థకు నెలకు రూ.90 వేలు మున్సిపాలిటీ చెల్లించాల్సి ఉంటుంది. పీచు, కోకో పిట్ మున్సిపాలిటీనే అమ్ముకోవచ్చు.

రోడ్లపై పోస్తున్న బొండాలు



కంపోస్టు యార్డులో ఉన్న కొబ్బరి బొండాలు

పట్టణంలో ఉత్పత్తి అవుతున్న కొబ్బరి బొండాలలో కొన్నింటిని కంపోస్ట్ యార్డుకు మిగిలినవి రోడ్ల వెంట గతం నుంచి పోస్తూ వచ్చారు. ఇలా చేయటం వల్ల వాహనదారులు ప్రమాదాలు గురవుతున్నారు. దీంతో కౌన్సిలర్‌లు, స్థానికులు వీటిని అక్కడి నుంచి తొలగించాలని గతంలో కోరాటంతో మున్సిపల్ అధికారులు లారీలతో రోడ్ల వెంట ఉన్న బొండాలను బయటకు తరలించారు. అలాగే దుకాణాలలో ఉత్పత్తి అయిన బొండాలను మీరే ప్రత్యేక వాహనంలో శివారు ప్రాంతాలకు తరలించుకోవాలని మున్సిపల్ అధికారులు సూచించారు. దీంతో వ్యాపారులు వాటిని శివారు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, ప్రజాప్రతినిధులు స్పందించి తెనాలిలో నెలకొన్న కొబ్బరి బొండాల సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నెలలో పరిష్కరిస్తాం



తెనాలిలో కొబ్బరి బొండాల సమస్య ఎక్కువగా ఉన్న మాట వాస్తవం. పీచు తయారు చేసే యూనిట్ చిన్నదికావటం వల్ల కొన్ని ఇబ్బందులు వచ్చాయి. 15 టన్నుల యూనిట్‌ను నెలకొల్పే బాధ్యతను ప్రవేట్ సంస్థకు అప్పగించాం. వారు నూతన మిషనరీని ఏర్పాటు చేస్తున్నారు. పనులు పూర్తి కాగానే యూనిట్‌ను పునః ప్రారంభిస్తాం. నెలరోజుల్లో కొబ్బరి బొండాల సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

–ఆకుల శ్రీనివాసరావు, సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డీఈ, తెనాలి పురపాలక సంఘం

కాల్వను ప్రతిరోజు శుభ్రం చేయండి

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: పట్టణంలోని మురుగు కాల్వను ప్రతిరోజు శుభ్రం చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. పట్టణంలోని నాజరుపేటలో సోమవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వల్లో వ్యర్థాలు, ప్లాస్టిక్ సీసాలు వేయవద్దని సూచించారు. వీటివల్ల మురుగు పారుదల నిలచిపోతుందని చెప్పారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పలువురు ఉద్యోగులు ఉన్నారు.

చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం పోరాడదాం

తెనాలి: జనాభా దామాషా మేరకు చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం ఓబీసీలమంతా సమైక్యంగా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సమగ్ర కుల గణన షెడ్యూల్ గెజిట్ ప్రచురణపై హర్షం వ్యక్తం చేస్తూనే, జనాభా దామాషా మేరకు ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలనే నినాదంతో ఇకపై దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధపడుతున్నామని శంకరరావు తెలిపారు. కేంద్రంలో ప్రత్యేకంగా ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పరిచి, జనాభా దామాషా మేరకు ఓబీసీ సబ్ ప్లాన్ రూపొందించి, ఆ మేరకు బడ్జెట్లో నిధులు కేటాయించి, సక్రమంగా పథకాలను అమలు పర్చాలని విజ్ఞప్తి చేశారు.

తెనాలిలో ప్రజాసంఘాల ధర్నా

- సంధ్యారాణి బలవన్మరణ కేసు విషయమై...
- అత్తింటివారిపై 304(బి) కింద కేసు నమోదుకు డిమాండ్
- కొల్లిపర ఎస్ఐపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలి
- సబ్‌కలెక్టర్ సంజనా సింహాకు వినతి



ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు



సంధ్యారాణి (ఫైల్)

తెనాలి: కొల్లిపర మండల గ్రామం వల్లభాపురంలో చప్పిడి సంధ్యారాణి ఆత్మహత్యకు కారకులైన భర్త, అత్తమామలు, చిన్న మామపై సెక్షన్ 304(బీ) ఐపీసీ కింద కేసు నమోదుచేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్‌తో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. కులనిర్మూలన పోరాట సమితి, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో సంధ్యారాణిని భర్త సంతోష్ కుమార్, అత్తమామలు కుమారి, వసంతరావు, చిన్న మామ కొండలు వరకట్న వేధింపులకు గురిచేసి, ఆమె ఆత్మహత్యకు పాల్పడేలా చేశారని ఆరోపించారు. మృతురాలి బంధువుల ఆందోళన తర్వాతనే 306 సెక్షన్ కేసు నమోదు చేశారని, అందులో చిన్న మామ పేరు చేర్చలేదన్నారు. ధర్నా చేయబోతున్నట్టు తెలిసి నిందితుల ను అరెస్టు చేశారని ఆరోపించారు. సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహాకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆయా సంఘాల నేతలు, సంధ్యారాణి తల్లిదండ్రులు మీడియాతో చెప్పిన వివరాలిలా ఉన్నాయి. సంధ్యారాణి స్వగ్రామం పల్నాడు జిల్లా నకిరికల్లు మండలం కండ్లకుంట. తల్లిదండ్రులు పెరుగు ధనలక్ష్మి-ప్రసాద్. రెక్కల కష్టంతో ఇద్దరు బిడ్డలను చదివిస్తున్నారు. వల్లభాపురానికి చెందిన చప్పిడి వసంతరావు-కుమారి ఏకైక కుమారుడు సంతోష్ కుమార్‌కిచ్చి 2019లో పెళ్లి చేశారు. రూ.3 లక్షల నగదు, 75 సెంట్ల భూమిని కట్నంగా ఇచ్చారు. పెళ్లయిన తర్వాత అదనపు కట్నం కోసం సంధ్యారాణిని శారీరకంగా, మానసికంగా హింసించటంతో, రెండుగ్రామాల పెద్దలు మాట్లాడి సర్దుబాటు చేశారు. కాపురం సజావుగా సాగింది. ఇద్దరు బిడ్డలు కలిగారు. అయినాసరే, అత్తింటివారి ధన దాహం తీరకపోవటంతో మళ్లీ సంధ్యారాణిపై వేధింపులు కొనసాగించారు. ఏప్రిల్ నెల 23న రాత్రి సంధ్యారాణిపై దాడిచేసి తీవ్రంగా హింసించారు. ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి తీసుకెళ్లమని హెచ్చరించారు.

మరుసటిరోజు వల్లభాపురం వెళ్లిన ప్రసాద్, ధనలక్ష్మి దంపతులు మరోసారి పెద్దల సమక్షంలో సర్ది చెప్పి వెనుదిరిగారు. ఆ వెంటనే సంతోష్‌కుమార్ కొట్టటంతో మనస్తాపం చెందిన సంధ్యారాణి, ఒంటిపై డీజిల్ పోసుకుని తగులబెట్టుకుంది. ఇరుగుపొరుగు ఇచ్చిన సమాచారంతో పరుగున వచ్చిన తల్లిదండ్రులు, ఆసుపత్రికి తరలించారు. గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో 43 రోజులు మృత్యువుతో పోరాడిన సంధ్యారాణి ఈనెల 5న మృతిచెందింది. మృతదేహాన్ని నాలుగురోజులు మార్చురీలోనే ఉంచి, కేసు లేకుండా చేస్తేనే అంత్యక్రియలు చేస్తామని, పిల్లలకు ఎంతో కొంత ఇస్తామంటూ బెదిరించారని ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. తల్లిదండ్రులు నిరాకరించటంతో 306 సెక్షన్‌పై కేసు నమోదుచేశారని ఆరోపించారు. ఎఫ్ఐఆర్ కాపీ, శవపంచనామా రిపోర్టు, 161 రిపోర్టు ఏదీ ఇవ్వలేదని కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ చెప్పారు.

నిందితులకు అనుకూలంగా వ్యవహరించిన కొల్లిపర ఎస్ఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో ప్రజాసంఘాల నాయకులు ఎస్.పోతురాజు, జక్కా బ్రహ్మయ్య, జంపాల దుర్గ, చలంచర్ల అంజి, అందే శ్యామ్, కంచర్ల శేషు తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని మోసం చేశారు



సంతోష్ కుమార్‌కు ఉద్యోగం ఉందంటే అమ్మాయి సుఖ పడుతుందని డిగ్రీ చదువుతున్న పిల్లనిచ్చి పెళ్లిచేశాం. కట్నం ఇచ్చాం. పెళ్లయ్యాక చదువుకుని సంధ్యారాణి డిగ్రీ పూర్తిచేసింది. మేమిచ్చిన కట్నం తక్కువని, వేరే పెళ్లి చేస్తే ఎక్కువ డబ్బు వస్తుందని మా బిడ్డను హింసిస్తూ, దొంగతనం నేరారోపణ చేసి మా కుమార్తె బలవన్మరణానికి కారకులయ్యారు. నేరానికి తగిన కేసు నమోదుచేసి, నిందితులను అరెస్టు చేయాలి.

–పెరుగు ధనలక్ష్మి–ప్రసాద్

పెట్టుబడి సాయం 20 వేలు అందించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకుల వినతి



తహసీల్దారు సిద్దార్థకు వినతిపత్రం అందజేస్తున్న శివసాంబిరెడ్డి

కొల్లిపర: ప్రభుత్వం సొంత భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని కోరుతూ కొల్లిపర తహసీలార్ జి.సిద్ధార్థకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం కలసి వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 70 శాతంగా గల కౌలు రైతులకు ప్రభుత్వం ఇచ్చే సాయం పరిహారం, బ్యాంకు రుణాలు అందక తీవ్రంగా నష్టపోతున్నారని వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం 2019 కౌలు చట్టాన్ని మార్పు చేయాలన్నారు. ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జొన్న, మొక్కజొన్న, వరి వంటి పంటలు కోతకు వచ్చే ముందుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతిగింజను కొనుగోలు చేయాలని కోరారు. వినత పత్రం అందుకున్న తహసీల్దార్ సిద్ధార్థ మాట్లాడుతూ కౌలు రైతులకు సంబంధించిన సమాచారం తీసుకుని వారికి కౌలు కార్డులు ఇప్పించేందుకు ఇప్పటికే సిబ్బంది చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. వినతి పత్రం ఉన్న మిగిలిన విషయాలను జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌలురైతుసంఘంమండల కార్యదర్శి కోట చంద్రశేఖరరావు, మురళి పాల్గొన్నారు.

ఉపాధి హామీ జాబ్ కార్డులు మంజూరు చేయాలి

గాంధీనగర్ వాసుల వినతి



కొల్లూరు : ఉపాధి హామీ పథకం పనులు చేసుకోవడానికి అవసరమైన జాబ్ కార్డులు మంజూరు చేయకపోవడంతో పనులకు హాజరవ్వలేని పరిస్థితి నెలకొందని పలు కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొల్లూరు శివారు గాంధీనగర్‌కు చెందిన పలు కుటుంబాల వ్యక్తులు తమకు జాబ్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీడీవో కె.నరసింహారావు, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఉపాధి హామీ పథకంలో పనులు చేసే అవకాశం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అగత్యం ఏర్పడిందని తక్షణం జాబ్ కార్డులు మంజూరు చేయించాలని కోరారు. ప్రభుత్వ పథకంలో పక్కా గృహాలు నిర్మించుకోవడానికి సైతం జాబ్ కార్డులు అడుగుతున్న నేపథ్యంలో తమకు కార్డులు ఇవ్వాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న సీనియర్ అసిస్టెంట్ హుస్సేన్

రేపల్లె: ప్రజలు తమ సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పరిష్కరించుకోవాలని ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ హుస్సేన్ అన్నారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అనంతరం మాట్లాడారు. వెల్లటూరు గ్రామానికి చెందిన బొమ్మిడి పద్మావతి కాలనీలో సైడ్ కాల్వలు నిర్మించాలని అర్జీ అందించిందన్నారు. నగరం మండలం అద్దంకివారిపాలెం గ్రామంలో తన వ్యవసాయ భూమిని ఆన్‌లైన్ చేయాలని రాయల అచ్చయ్య, నగరంకు చెందిన గాలి పూర్ణచంద్రరావు తన భూమిని ఆన్‌లైన్ చేయాలని అర్జీలు చేసుకున్నారన్నారు. అలాగే కళ్ళిఫలంకు చెందిన బెల్లంకొండ లక్ష్మి అన్నపూర్ణ ఇసుకపల్లిలోని తన భూములను ఆన్‌లైన్ చేయాలని, నల్లూరులోని సనాతన వేదాంత నిష్టాశ్రమ భూములకు పట్టాదారు పాసు పుస్తకం కోసం ఆశ్రమం తరపున పుట్టగుంట ప్రేమ్‌కుమార్ అర్జీలు అందించారన్నారు. భూమిని సర్వే చేయాలని కోరుతూ పేటేరుకు చెందిన గుమ్మడి కోటేశ్వరరావు అర్జీ అందించారని చెప్పారు. తాలూకా ఎదుట ఉన్న పోస్టాఫీసును పునఃప్రారంభించాలని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సి.వి.మోహనరావు అర్జీ చేశారన్నారు.

గంగడిపాలెంలో తనకు చేపల చెరువు కలదని, మత్స్యకార భరోసా నిధులు మంజూరు చేయాలని ఆ గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు అర్జీ అందించారన్నారు. త్రీఫేస్ విద్యుత్ లైన్‌కై పట్టణంలోని 3వ వార్డుకు చెందిన ఎం.సునీత, ఆర్ అండ్ బీ రహదారి ఆక్రమణలను తొలగించాలని పేటేరు గ్రామానికి చెందిన ఉరిమి శ్రీనివాసరావు అర్జీలు ఇచ్చారన్నారు. ఆయా సమస్యలు సంబంధిత శాఖల అధికారుల ద్వారా పరిష్కరించబడునన్నారు.

సార్వత్రిక సమ్మె నోటీసులు అందజేత

మంగళగిరి టౌన్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ.. జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె నోటీసును సోమవారం అడిషనల్ కమిషనర్ శకుంతలకు ప్రజాసంఘాల నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు సార్వత్రిక సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. దానికి సంబంధించిన సమ్మె నోటీసులను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులంతా సమ్మెలో పాల్గొనే విధంగా నోటీసులు అందజేశామని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐఎఫ్‌టీయూ నాయకులు అన్నవరపు ప్రభాకరావు, చిన్ని సత్యనారాయణ, నందం బ్రహ్మేశ్వరరావు, గండికో దుర్గారావు, ఎస్ఎస్ చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

తాడికొండ: దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రాణాలర్పించిన నిస్వార్థ దేశ భక్తుడు, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని తాడికొండ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య అన్నారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని తుళ్లూరులో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చెవుల శ్రీకాంత్, కర్రి వినోద్, వేమూరి శరత్ బాబు, నేరుగ బాబు, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అమెరికా దాడులపై వామపక్షాల నిరసన



అంబేద్కర్ సెంటర్‌లో నాయకుల మానవహారం

మంగళగిరి టౌన్: ఇరాన్‌పై అమెరికా బాంబు దాడులు చేయడాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళగిరి నగర పరిధిలోని అంబేద్కర్ సెంటర్‌లో సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో సోమ వారం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ.. ఈ దాడులను ప్రపంచ వ్యాప్తంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అమెరికా ఇజ్రాయిల్ అనుకూల వైఖరిని విడనాడాలని కోరారు. అంతర్జాతీయ ఉద్రిక్తతలను మరింత పెంచడమే కాకుండా పశ్చిమ ఆసియా అస్థిరతకు దారి తీసే విధంగా అమెరికా సైనిక చర్యలు ఉన్నాయని అన్నారు.వామపక్ష నేతలు చిన్ని తిరుపతయ్య, అన్నవరపు ప్రభాకర్, నందం బ్రహ్మేశ్వరరావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఎస్ఎస్ చెంగయ్య, జవహర్ లాల్, పి.బాలకృష్ణ, జీవీ రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవు



నదిలో పరిశీలన చేస్తున్న మైనింగ్ ఆర్ఐ

కొల్లూరు : కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలు చేపట్టడానికి ఎటువంటి అనుమతులు లేవని మైనింగ్ ఆర్ఐ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. మండలంలోని గాజుల్లంక కృష్ణా నదిలో ఉచిత ఇసుక క్వారీలో గడువు ముగిసినా నిబంధనలను అతిక్రమించి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం అందడంతో పరిశీలనకు వచ్చినట్లు ఆయన తెలిపారు. నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా మైనింగ్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 15తో గడువు ముగిసిన నేపథ్యంలో ఎటువంటి ఇసుక తవ్వకాలు చేపట్టవద్దని గతంలో ఉచిత ఇసుక క్వారీ పొందిన ఏజెన్సీ వ్యక్తులకు తెలియజేశామన్నారు. నదిలో, పట్టా భూములలో గడువు ముగిసినప్పటికీ చేపడుతున్న తవ్వకాలపై ఏజెన్సీ వ్యక్తులను ప్రశ్నించడం జరిగిందన్నారు. ఇసుక నింపుకొని లారీలు వెళుతుండటాన్ని గమనించి వాటిని పరిశీలించగా వారి వద్ద ఎటువంటి బిల్లులు లేకపోవడంతో 3 లారీలను చెరుకుపల్లి పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు. అయితే మైనింగ్ శాఖాధికారుల తూతూ మంత్ర పరిశీలనపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.